www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 28 మార్చి 2023



ఉపాధి హామీ చట్ట నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

తణుకు రూరల్: మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఎంఎంఎస్ యాప్‌తో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు తెలిపారు. సోమవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలోమండలంలోని కొమరవరంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను వీరభద్రరావు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఈ వేసవిలో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించినందున ఎలాంటి ప్రాణ నష్టమూ జరగకుండా ఉపాధి హామీ రెండు పూటలా పని రద్దు చేసి పాత పద్ధతిలో కొలతల ప్రకారం పని చేయించాలని డిమాండ్ చేశారు. కూలీల సమస్యలు పరిష్కరించలేని ఇలాంటి ప్రభుత్వం వల్ల మనకు ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికి కూలీలందరూ ఏకం కావాలని ఆయన కోరారు. అనంతరంచలో ఢిల్లీ ప్రాధాన్యతను కూలీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, ధనలక్ష్మి, పల్లమ్మ, రాముడు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజాస్వామ్యం పూర్తిగా మంటకలుస్తోంది. ప్రజాసమస్యలపై మాట్లాడమే నేరంగా మారిపోయింది. సమస్యలపై ఆందోళనకు పిలుపునిచ్చినా, సిఎం పర్యటనలు జరిగితే ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు, ప్రజలపై ఉక్కుపాదం మోపుతూ పోలీస్ రాజ్యంగా మార్చేసిన తీరు ప్రజల్లో తీవ్ర చర్చనియాంశంగా మారింది. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ గృహనిర్బంధంతో ప్రభుత్వం అణిచివేత ధోరణి పరాకాష్టకు చేరింది. గత ప్రభుత్వం జనాలపై ప్రయోగించిన తీవ్ర నిర్బంధాలకు ప్రజాగ్రహం చవిచూసి భారీ మూల్యం చెల్లించుకుంది. వైసిపి ప్రభుత్వం సైతం రానున్న ఎన్నికల్లో ప్రజాగ్రహం చవిచూడక తప్పదన్న చర్చ జనాల్లో కొనసాగుతోంది.



పరాకాష్టకు అణచివేత..!

గత ప్రభుత్వాన్ని మించి దారుణమైన పాలన

ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు, ప్రజలపై ఉక్కుపాదం

పోలీస్ రాజ్యంగా మార్చేసిన దుస్థితి

సమస్యలపై పోరాడితే అరెస్టులు, గృహనిర్బంధాలే

మహిళలపైనా కనికరం లేకుండా నిర్బంధకాండ

ఎంఎల్‌సి సాబ్జీ గృహనిర్బంధంపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2014 ఎన్నికల్లో టిడిపి ఉమ్మడి జిల్లాలో ఉన్న 15 అసెంబ్లీ స్థానాలను, రెండు ఎంపీ స్థానాలను అత్యధిక మెజార్టీతో గెలుచుకుని ప్రతిపక్షం అనేది లేకుండా చేసింది. అదేవిధంగా జిల్లాపరిషత్, మున్సిపాలిటీలు, మండల పరిషత్‌ల్లోనూ ప్రతిపక్ష పార్టీ వైసిపికి చోటు దక్కలేదు. అలాంటి స్థితినుంచి 2019 ఎన్నికల్లో ఆ పార్టీ రెండు ఎంఎల్ఎ స్థానాలకు పరిమితంకాగా, ఎంపీ సీట్లు ఒక్కటి కూడా దక్కలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పత్తాలేకుండా పోయింది. దీనంతటికీ ప్రధానకారణం 2014 నుంచి 2019 వరకూ టిడిపి ప్రభుత్వం సాగించిన ఆరాచక, నిర్బంధ పాలనే కారణమని చెప్పొచ్చు. భీమవరం ప్రాంతం తుందుర్రులో తలపెట్టిన ఫుడ్‌పార్క్‌కు వ్యతిరేకంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రోడ్డెక్కారు. ప్రజాఆందోళన అణిచివేయడానికి టిడిపి ప్రభుత్వం అప్పట్లో వ్యవహరించిన తీరు జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మహిళలపై సైతం హత్యాయత్నం కేసులు నమోదు చేసి జైల్లో పెట్టింది. ప్రజాసంఘాలు, సిపిఎం నాయకులపై పెద్దఎత్తున అక్రమకేసులు బనాయించి తీవ్రఇబ్బందులకు గురిచేసింది. తుందుర్రు గ్రామానికి వెళ్లాలంటే ఆధార్‌కార్డు చూపిస్తే తప్ప వెళ్లనిచ్చేవారు కాదు. చెక్‌పోస్టులు పెట్టి దాదాపు ఎన్నికల వరకూ తీవ్ర నిర్బంధం కొనసాగింది. ఇది టిడిపి ప్రభుత్వంపై జనాల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. ఇక గరగపర్రులో దళితులపై అగ్రవర్ణ పెత్తందారులు చేసిన దాష్టీకంపై అక్కడి ప్రజలు చేసిన పోరాటాన్ని అణిచివేయాలని ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. దీంతో ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుంది. పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను చెప్పుకునేందుకు వీలులేకుండా సిఎం పర్యటనల సందర్భంగా గిరిజనులపై పోలీసులను ఉసిగొల్పి తీవ్ర అణిచివేత చర్యలకు దిగింది. చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ బాధితులపైన ఇదేవిధంగా వ్యవహరించింది. ఆక్వా చెరువులకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన సమయంలో టిడిపి ప్రభుత్వం నిరంకుశ ధోరణితో ముందుకు సాగింది. ఇసుక తవ్వకాల విషయంలో ముసునూరు తహశీల్దార్ వనజాక్షిపై జరిగిన దాడి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. సిఎం పర్యటనల నేపథ్యంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నాయకులపై పోలీసులు తీవ్ర నిర్బంధం సాగించారు. అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, ఇతర ఉద్యోగుల చేపట్టిన ఆందోళనపై టిడిపి ప్రభుత్వం దారుణంగా వ్యవహరించింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక నిర్బంధ, నిరంకుశ ఘటనలు టిడిపి ఐదేళ్ల పాలనలో సాగాయి. దీంతో విసిగిపోయిన జనం 2019 ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధిచెప్పారు. కేవలం రెండు సీట్లకే పరిమితం చేసి తమ సత్తా చూపించారు.

వైసిపి ప్రభుత్వంలో అంతకు మించి నిర్బంధకాండ

టిడిపి పాలనతో విసిగిపోయిన జనం వైసిపిని తిరుగులేని ఆధిక్యతతో గెలిపించారు. జనాల ఆశలపై ఈ ప్రభుత్వం నీళ్లు చల్లింది. నిర్బంధకాండలో టిడిపి ప్రభుత్వకంటే అత్యంతదారుణంగా ముందుకు సాగుతోంది. అప్పట్లో పోలీసులు కొంత ఆచితూచి వ్యవహరించేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సిఎం వస్తున్నారంటే ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నాయకులను అర్ధరాత్రి, అపరాత్రి అనితేడా లేకుండా వెంటపడి మరి నిర్బంధించడం, అరెస్టులు చేయడం చేస్తున్నారు. సిఎం పర్యటన అంతా బారికేడ్లు, పరదాల మధ్యనే జరుగుతుంది. గతంలో సిఎం పర్యటనల సందర్భంలో ప్రజాసంఘాల నాయకులు సభ వద్దకు వెళ్లి ప్రజాసమస్యలపై వినతులు ఇచ్చేవారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నుంచి సిఎంగా పనిచేసిన వారంతా వినతులను తీసుకుని సమస్యలు పరిష్కరించమని అధికారులకు అప్పగించేవారు. గత టిడిపి ప్రభుత్వం తొలినాళ్లలో కూడా కొంతమేర ఈవిధానం కొనసాగింది. నల్లజర్ల మండలంలో సిఎం పర్యటన సందర్భంగా ఒక వ్యక్తి లేచి తమ సమస్యపరిష్కారానికి ఫలానా అధికారి ఇబ్బంది పెట్టారని చెప్పడంతో చర్యలు తీసుకున్న సందర్భాలు సైతం ఉన్నాయి. కామవరపుకోట సభలో కౌలు రైతుల సమస్యపై కౌలురైతు సంఘం నాయకులు వేదికపైకి ఎక్కి మాట్లాడిన ఉదంతాలున్నాయి. కానీ నేడు ఆ పరిస్థితి కనుచూపుమేర కూడా లేకుండాపోయింది. తమసమస్యపై నినదిస్తున్న అంగన్‌వాడీ, ఆశావర్కర్లు వంటి మహిళా ఉద్యోగులపై తీవ్ర నిర్బంధాలు ప్రయోగిస్తున్నారు. ఉద్యోగుల ఆందోళనలపై ఉక్కుపాదం ప్రయోగిస్తూ పోలీస్ రాజ్యం కొనసాగిస్తున్నారు. సమస్యలపై ఏ ప్రజాసంఘం పిలుపునిచ్చినా అన్ని ప్రజాసంఘాల నాయకులను నిర్బంధం చేస్తున్నారు. కలెక్టరేట్ వద్ద నిరసనలను సైతం నిర్బంధాలతో అణచేందుకు చూస్తున్నారు. ప్రభుత్వం సాగిస్తున్న నిర్బంధ కాండ జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టిడిపికి పట్టిన గతే పడుతుందంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుంది. ప్రశ్నించడమే తప్పుగా ఈ ప్రభుత్వ ధోరణి మారింది. దీంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఎంఎల్‌సి సాబ్జీ గృహనిర్బంధం చర్చనీయాంశం

ఇప్పటి వరకూ ప్రజాసంఘాలు, ఉద్యోగులు, జనాలపై కొనసాగిన నిర్బంధకాండ ఇప్పుడు ఎంఎల్‌సిలను సైతం నిర్బంధించే స్థాయికి చేరింది. ఈనెల 25న జరిగిన సిఎం పర్యటనకు ఎంఎల్‌సి సాబ్జీని ఆహ్వానించి, ప్రోటోకాల్‌లో పేరుచేర్చి, రాకుండా పోలీసులు గృహనిర్బంధం చేసిన తీరు నిరంకుశత్వానికి నిదర్శమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులను సైతం మాట్లాడకుండా చేయాలన్న ప్రభుత్వ వ్యవహార శైలిపై తీవ్ర ఆగ్రహ జ్వాలాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం చేస్తున్న నిర్బంధకాండకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదంటూ జనం చర్చించుకుంటున్నారు.



యలమంచిలిలో..

చలో ఢిల్లీ జయప్రదానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఓడించాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ పిలుపు నిచ్చారు. వచ్చేనెల ఐదో తేదీన జరిగే చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన జాతా సోమవారం నరసాపురం పట్టణం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్లో జరిగిన సభకు సిఐటియు పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. కె.రాజారామ్మోహన్‌రాయ్ మట్లాడుతూ మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల, రైతుల, ప్రజల సమస్యలను మరింత జఠిలం చేస్తూ వారి డిమాండ్లను ఆమోదించకుండా అత్యంత ధనవంతులైన అదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగి తేలుతుందన్నారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాసిరెడ్డి జార్జి, కౌరు పెద్దిరాజు, జల్లి రామ్మోహన్‌రావు, సిఐటియు నాయకులు పొన్నాడ రాము, బి.అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.వలి పాల్గొన్నారు.


యలమంచిలి: వచ్చేనెల ఐదో తేదీన జరగనున్న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారజాత సోమవారం మండలంలోని కలగంపూడి, ఏనుగువానిలంక, చించినాడ, మేడపాడు, కట్టుపాలెం, ఇలపకుర్రు, దొడ్డిపట్ల, అడవిపాలెం గ్రామాల్లో సాగింది. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, సిఐటియు నాయకులు కె.రాజారామ్మోహన్‌రాయ్, సుధాకర్, కౌలురైతుసంఘం నాయకులు మామిడిశెట్టి రామాంజనేయులు, మాసవరపు సుబ్బారావు, పొత్తూరి నరసింహరాజు పాల్గొన్నారు.

వీరవాసరం : చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచారజాతా సోమవారం వీరవాసరం చేరుకుంది. ఈ జాతానుద్దేశించి ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరాం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దళ బృందం కె.రాజారామ్మోహన్‌రాయ్, కె.ఉదయకుమార్, కేతి శ్రీను, దేవాల శివగణేష్, కె.నరేష్, వెంకన్న, ఆశ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు : మోడీ ప్రభుత్వం ప్రశ్నించేవారిని అణచడమే లక్ష్యంగా పెట్టుకుందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ విమర్శించారు. చలో ఢిల్లీ ప్రచార జాతా సోమవారం పాలకొల్లు చేరుకుంది. ఈ సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్ వద్ద జరిగిన కళా ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఈ జాతాలో సిఐటియు పాలకొల్లు, యలమంచిలి కార్యదర్శులు జవ్వాది శ్రీనివాస్, దేవ సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాతిరెడ్డి జార్జి, వలవల శ్రీరామ్మూర్తి, యర్రా అజయ్, లక్ష్మీ, జాన్సీ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



పాలకొల్లులో..



ఆందోళన చేస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం

ప్రజాశక్తి - భీమవరం

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో అందరినీ కలుపుకుని ఉద్యమం కొనసాగిస్తామని భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం సోమవారం 19వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా కలెక్టరేట్ వద్ద వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది గౌతమబుద్ధ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీర్ఘకాలంగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నప్పటికీ స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరితో ముందుకు సాగితే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు డిఎ చెల్లిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి డిఎ చెల్లించకపోవడం ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవడానికి ఇదే నిదర్శమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి వై.దుర్గాకిషోర్, సూపరింటెండెంట్ ఎస్.సుబ్రహ్మణ్యం, నిజాముద్దీన్ షా, సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, జి.కళ్యాణి, పి.గౌతమి, పివి.సాంబశివరావు, కె.సురేష్, డిటి సూర్యనారాయణరాజు, జూనియర్ సహాయకులు దివ్య స్మయిలి, సాయి, జీవన్, సుభాష్, రమా, సిబ్బంది బుజ్జియ్య, సూర్యకాంతం, అనురాధ, మురళీ, సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో

డ్రైవర్‌తోపాటు ఏడుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు



డివైడర్‌ను ఢీకొన్న ఆటో

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మోటార్ సైకిల్‌ను తప్పించబోయి విద్యార్థుల ఆటో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులతో పాటు, ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలయ్యారు. ఈ సంఘటన సోమవారం భీమవరంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరు మండలం పాలకోడేరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆనందరావు గొల్లలకోడేరు, తుమ్మలగుంటపాలెం, మహదేవపట్నం గ్రామాల్లోని విద్యార్థులను రోజూ భీమవరంలోని సెంట్‌మేరీస్ హైస్కూల్ తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 15 మంది విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుని భీమవరం తీసుకొస్తున్న సమయంలో బివి రాజు కళాశాల రోడ్డులోని ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద మోటార్ సైకిల్‌ను తప్పించబోయి ఆటో డివైడర్‌ను కొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు, ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటీన గాయపడిన వారిని ప్రయివేటు వాహనంలో అక్షర హాస్పిటల్‌కు తరలించారు. వీరంతా గొల్లలకోడేరు, మహదేవపట్నం, పాలకోడేరు చెందిన విద్యార్థులుగా గుర్తించారు. వారిలో మహదేవపట్నానికి చెందిన పొలమూరి ప్రవీణ్ సంతోష్ (8వ తరగతి) ఎడమ చేయి విరిగింది. గొల్లలకోడేరుకు చెందిన సోడదాసి స్వర్ణ విశాల్ (5వ తరగతి) కుడికాలు రెండు చోట్ల విరిగింది. వారికి సర్జరీ చేస్తున్నారు. అలాగే తుమ్మలగుంటపాలెంకి చెందిన కుక్కల తేజ అశ్విన్ (4వ తరగతి) కాలుకు గాయం కాగా సిమెంట్ కట్టే వేశారు. కుక్కల భార్గవి (8 తరగతి) తలకు గాయమైంది. అలాగే ఆటో డ్రైవర్ కుమార్తె గరికముక్కల సంజన (6 తరగతి) చేతికి గాయమైంది. మిగిలిన విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గాయపడి విద్యార్థులను మాజీ ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు, డిఎస్‌పి శ్రీనాథ్, పోలీసు సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి క్షతగాత్రులను పరామర్శించారు.





ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు

బాధ్యతతో అర్జీలను పరిష్కరించాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన అర్జీలను బాధ్యతతో పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన 162 అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినతుల పరిష్కారం అర్జీదారులు సంతృప్తి చెందేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ అప్పారావు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.



స్పందనలో ప్రజల సమస్యలు వింటున్న డిఆర్ఒ కృష్ణవేణి

అధికారులు మొద్దు నిద్ర వీడాలి

విద్యార్థులను పరామర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



గాయపడిన విద్యార్థిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రయివేటు పాఠశాలల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు పట్టణంలో సంఘటనే నిదర్శమని, ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు మొద్దునిద్ర వీడాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. సెయింట్ మేరీ పాఠశాలలో చదువుతున్న పాలకోడేరు, గొల్లలకోడేరు గ్రామాలకు చెందిన విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ వెంటనే హాస్పిటల్‌కి చేరుకొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే అనేకసార్లు పరిమితికి మించి బస్సుల్లో, ఆటోల్లో విద్యార్థులను తరలిస్తున్న పాఠశాలలు, కళాశాలలపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖకు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. ఈ ఘటనతో అయినా అధికారులు మొద్దు నిద్ర వీడాలన్నారు. తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను పరామర్శించిన వారిలో పట్టణ సహాయ కార్యదర్శి యు.వినోద్, పట్టణ కమిటీ సభ్యులు బి.గణేష్ ఉన్నారు.

టెండర్ విధానం రద్దు చేయాలని..

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - తణుకురూరల్

కార్మికుల పొట్టలు కొట్టే టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు పాత పద్ధతిలో అగ్రిమెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం టెండర్ విధానాన్ని రద్దు చేయాలని స్థానిక ఎపి సీడ్స్ వద్ద కార్మికులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఎక్కడా లేని టెండర్ విధానాన్ని తణుకు సీడ్స్‌లో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. మూటలు మోసుకుని జీవనం సాగిస్తున్న వారి పొట్టలు కొట్టడం సరికాదని తెలిపారు. కార్మికుల జీవితాలు చాలా చిన్నవని, వారికి హానీ చేస్తే చూస్తూ ఊరుకోబోమని, సమస్య పరిష్కారం కాకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.దక్షిణామూర్తి, గార రంగారావు, టి.రామకృష్ణ, జి.త్రిమూర్తులు, కె.వరలక్ష్మి, ఎన్.లక్ష్మి పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలియజేస్తున్న కార్మికులు



డ్వాక్రా మహిళలకు చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - అత్తిలి

మహిళలకు ఆసరాగా ఉండడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అత్తిలి వల్లీ దేవసమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మండపంలో డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా నగదు విడుదల కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మండలంలో 1,357 స్వయం సహకార సంఘాలకు 13,687 మంది సభ్యులు ఉన్నారన్నారు. మొదటి విడత నుండి ఇప్పటివరకు ఒక్కో ఏడాది రూ.13.74 కోట్లు ఆసరా కల్పించగా, ఇంకా రూ.13.74 కోట్లు ఇవాల్సి ఉందన్నారు. అనంతరం చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి సర్పంచి గంట విజేత, ఎంపిపి మక్కా సూర్యారావు, ఎఎంసి ఛైర్మన్ బుద్దారతి భరణి ప్రసాద్ పాల్గొన్నారు.

నరసాపురం : ప్రతి మహిళా పేదరికాన్ని జయించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం లిఖితపూడి గ్రామంలో మండలంలోని కొప్పర్రు, బేతపూడి, మల్లవరం, మల్లవరంలంక, లిఖితపూడి, సరిపల్లి, చిట్టవరం, గొంది, కొత్త, పాత నవరసపురం గ్రామాలకు వైఎస్ఆర్ ఆసరా మూడో విడత రుణమాఫీ అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడానికి నాలుగు విడతలలో ఆసరా రుణమాఫీ డబ్బులు అందించడం జరుగుతుందన్నారు. నరసాపురం నియోజకవర్గానికి రూ.150 కోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా చనిపోయినట్లయితే వైఎస్ఆర్ బీమా ద్వారా ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోనీ, ఎంపిడిఒ వైఎస్.శివప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఒంగోలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబర్చారని స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న కె.హమేష్ బాలసాయి సుభాష్ కుమితే విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థిని సోమవారం స్కూల్లో ఏర్పాటు చేసిన అభినందన సభలో కృష్ణంరాజు అభినందించారు. ఈ సభలో స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, బి.యుగంధర్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద సిపిఐ దీక్షలు

ప్రజాశక్తి - భీమవరం

బహుళార్థ సాధక ప్రాజెక్టు, రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడంతో తొలుత డిజైన్ చేసిన విధంగా 150 అడుగుల ఎత్తులో నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారం, శాశ్వత పునరావాసం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర పిలుపులో భాగంగా భీమవరంలో జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ 24 లక్షల ఎకరాల సాగుభూమికి సాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి, విశాఖ, రాయలసీమ ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందించే బహుళ ప్రయోజనాలు ఇమిడిఉన్న ప్రాజెక్టు ఎత్తు తగ్గించరాదన్నారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే ఉపయోగముండదన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు మాట్లాడారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం ప్రాజెక్టు నిర్మాణంలో చిత్తశుద్ధి కనపర్చడం లేదన్నారు. ఈ దీక్షల్లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ సమావేశం ఎంపిపి అందే సూర్యవతి అధ్యక్షతన నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

పాలకోడేరు : పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 31వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనునట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మురళి గంగాధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని పేర్కొన్నారు.

కాళ్లకూరు వెంకన్నకు రూ.14.55 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణాధికారి దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు దండు వెంకట కృష్ణంరాజు, గ్రామస్తులు, ఏలూరుపాడు మహిళా మండలి, జ్ఞానానంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. 66 రోజులకు హుండీ లెక్కింపు నిర్వహించగా రూ.14 లక్షల 55 వేల 589 ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ చాగంటి సురేష్ నాయుడు తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఉండి

చిరుధాన్యాలతో పోషకాహార లోపాన్ని నిర్మూలించవచ్చని, దీనిపై తల్లులకు అవగాహన కల్పించి పోషక విలువల గల ఆహార పదార్థాలను తల్లులకు, పిల్లలకు అందించాలని సిడిపిఒ కృష్ణకుమారి తెలిపారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉండిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద విద్యార్థులకు కిశోర బాలికలకు చిరుధాన్యాలతో పౌష్టికాహారం తయారు చేసుకోవడం వాటి విలువ గురించి వివరించారు. చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన శక్తి, ప్రోటీన్లు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రత్నకుమారి, అనిల్ కుమారి, మేరీ, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూలపల్లిలో అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పూలపల్లిలో గంటాలమ్మ, దేవులమ్మ అమ్మవార్ల జాతరలో భాగంగా సోమవారం అఖండ అన్నసమారాదన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులకు అన్నప్రసాదాన్ని అందించారు. రాష్ట్ర ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, వైసిపి రాష్ట్ర రాజకీయ సలహా మండలి సభ్యులు, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మత్తులో ముంచేశారు

టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి విమర్శ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తిరుమల క్షేత్రంలో టిటిడి కాంట్రాక్టు ఉద్యోగి గంజాయితో పట్టుబడడం ద్వారా రాష్ట్రం మత్తు ఆంధ్రప్రదేశ్‌గా జగన్ పరిపాలన మారిందని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయం నుండి విడుదల చేసిన పత్రికాప్రకటనలో తిరుమల కొండపై గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించడం జగన్ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. జగన్ సొంత బంధువులతో నిర్వహిస్తున్న టిటిడి పాలకమండలి ఆధ్వర్యంలో మత్తు, మద్యం బాబులకు నిలయంగా మారిందన్నారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అంటే దేశానికి అన్నపూర్ణగా ఉండేదని, ఇప్పుడు మత్తు పదార్థాలకు కేంద్రంగా నిలిచిందని తెలిపారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

దిగమర్రు బైపాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని కోనసీమ జిల్లా కాట్రేకోన మండలం పెనుమల్ల గ్రామానికి చెందిన పిల్లి మణికంఠ నాయుడు (32) మృతి చెందాడు. ఆదివారం రాత్రి బంధువుల పెళ్లి నిమిత్తం మణికంఠ నాయుడు పాలకొల్లు వచ్చాడు. రాత్రి పెళ్లి చూసుకుని సోమవారం తెల్లవారుజామున తిరిగి వెళ్లే క్రమంలో దిగమర్రు బైపాస్ వద్ద గుర్తు తెలియని ఢీకొట్టినట్లు రూరల్ స్టేషన్ రైటర్ మూర్తి తెలిపారు. మృతుడు మణికంఠకు 45 రోజుల క్రితమే పెళ్లి అయినట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొల్లు ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు వివి.గిరి విద్యార్థులు

ప్రజాశక్తి - ఆకివీడు

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎ.కృష్ణసాయి, జె.నాగ మునీంద్ర ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకూ బీహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు వీరు హాజరవుతారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సహ డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీ కార్యదర్శి డాక్టర్ పిబి.ప్రతాప్‌కుమార్, ఉభయ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి నంబూరి రామరాజు, అధ్యాపకులు వారిని అభినందించారు.

సిపిఐ సీనియర్ నేత గంగిశెట్టి మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

సిపిఐ సీనియర్ నేత కడలి గంగిశెట్టి (97) సోమవారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనేక ఉద్యమాలలో ఆయన పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రైతాంగ పోరాటాల్లో ఆయన చురుగ్గా పాల్గొనేవారు. ఆయన మృతి పట్ల సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, మండల కార్యదర్శి పోతుల మృత్యుంజయ, బాలం విజయకుమార్ సంతాపం తెలిపారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట : మంత్రి కారుమూరి

104 వాహనాలు ప్రారంభం



తణుకు రూరల్ : 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకురూరల్

ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేశారని, రోగాలను మొదట్లో గుర్తించి సరైన వైద్యం అందించి మందులు అందించనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి ఆవరణలో రెండు 104 వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటికి డాక్టర్‌ను పంపించి వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. వైద్యశాఖలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పలివెల వెంకట రవీంద్రనాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శివప్రసాద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దాట్ల సుందర రామరాజు, దుర్గా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండి: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ఉండి మండలానికి నూతనంగా కేటాయించిన రెండు 104 వాహనాలలో ఒక వాహనాన్ని సోమవారం పిహెచ్‌సిలో ఎంఎల్ఎ మంతెన రామరాజు, రెండో వాహనాన్ని యండగండి పిహెచ్‌సిలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు జెండాఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, కలిసిపూడి సర్పంచి కేశవోయిన జానకి, ఎండగండి గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, రణస్థుల మహంకాళి, కమతం వెనర్జీ పాల్గొన్నారు.

పాలకొల్లు: పాలకొల్లు నియోజకవర్గానికి మరో రెండు 104 వాహనాలు ఇచ్చినట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చినిమిల్లి గణపతి చెప్పారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మండల పరిషత్ అధ్యక్షురాలు చిట్టూరి కనకలక్ష్మి 104 వాహనాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దీనివల్ల నెలకు ప్రతి గ్రామానికి 2 రోజులు వైద్య సేవలందించే దిశగా సిఎం జగన్ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. దీంతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జి.ప్రభాకర్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ప్రతాప్‌కుమార్, నారాయణ, గుడాల హరిబాబు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గొరగాలమ్మ డ్రెయినేజీ వెంటనే ప్రక్షాళన చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వాలంటీర్లు ఉన్నారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

స్పందనలో వచ్చిన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల నుంచి 38 ఫిర్యాదులను సబ్ కలెక్టరు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వినతుల పరిష్కారం అర్జీదారులు ఆనందం కలిగించేలా ఉండాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : సోమవారం జరుగుతున్న స్పందన కార్యక్రమానికి వివిధ రకాల సమస్యలతో 16 వినతులు స్వీకరించినట్లు జిల్లా ఎస్‌పి కార్యాలయం తెలిపింది. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వినతులు స్వీకరించారు. ఆయా పరిధిలోని పోసిషన్‌లకు సిఫార్సు చేసి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దోమల నియంత్రణ అందరి బాధ్యత అని తాడేపల్లిగూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్యకేంద్రం యాగర్లపల్లి పరిధిలోని 24, 25వ వార్డుల్లో జరుగుతున్న ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, డ్రై డే ఫ్రైడే కార్యక్రమాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దోమతెరలు వాడాలని, పడుకునేటప్పుడు శరీరమంతా కవర్ చేసే దుస్తులు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, శానిటేషన్ కార్యదర్శి పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

మొగల్తూరు: కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి సుబ్బారావు ప్రభుత్వాన్ని కోరారు. ముత్యాలపల్లిలో ఆరోగ్య వర్షిణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థలం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంగస్థలం కళాకారుల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారులను ప్రోత్సహిస్తూ, పెన్షన్ మంజూరు చేసి వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి వారికి గృహాలను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరారు. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్య వర్షిణి వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి, సామాజిక సేవా కార్యకర్త నాగిడి రాంబాబు, తిరుమాని స్వామి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి కూలీలకు రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు అన్నారు. సోమవారం కొమ్ముగూడెంలో పని ప్రదేశంలో ఉపాధి కూలీలను ఆయన కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 5 వారాల నుంచి పనిచేస్తుంటే ఇప్పటివరకూ డబ్బులు పడలేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ వచ్చే ఏప్రిల్ ఒకటి నుంచి ఉపాధి కూలీలకు 15 రూపాయలు పెంచామని సర్క్యులర్ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక పక్క నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుంటే కేవలం 15 రూపాయలు పెంచి చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. రెండు పూటలా పని వద్దని, వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని కూలీలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మరుకూరు పెద్దిరాజు, పందిరి వెంకటరావు, గండికోట లక్ష్మి, గండికోట గంగ, బొనిగే వెంకటరావు పాల్గొన్నారు.

రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాంచరణ్ పుట్టినరోజు సందర్భంగా యువసేన ఆధ్వర్యంలో మారిశెట్టి అజయ్ బాబు సోమవారం పడాల వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాపు యువత అధ్యక్షులు మారిశెట్టి అజయ్‌బాబు, ఎస్‌విఆర్ సేవా సంఘం బోగిరెడ్డి.రాము, దొడ్ల బాలాజీ, తాడేపల్లిగూడెం చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షులు పాలూరి శేషు, పశ్చిమ గోదావరిజిల్లా చిరంజీవియువత కార్యదర్శి ఉనమట్ల లోకేష్, అప్పాజీ, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లు: మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజేషన్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 మంది అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో శిడగం సురేంద్ర, తులా సురేష్, ఆచంట చరణ్ దీపు, కాపిశెట్టి పెదకాపు, లంక కిరణ్‌సాయి, సాంబ, వలవల ఆనంద్ పాల్గొన్నారు.

63 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి పరిధిలోని వల్లూరు సచివాలయం వద్ద సోమవారం కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 63 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి చెప్పారు. 63 మందికి కళ్లజోళ్లు పడతాయని, వాటిని ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని చెప్పారు. అనంతరం గ్రామంలో స్థానికులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచి ముత్యాల వేణు మురళి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారాల వల్ల దోమలు పెరుగుతాయన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, చికెన్ గున్యా వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య హక్కు చట్టానికి వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - తణుకురూరల్

రాజస్థాన్ ప్రభుత్వం లోపభూయిష్టమైన చట్టం తెచ్చి ప్రయివేటు వైద్యశాలలను బలిపశువును చేయడం సరికాదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) తణుకు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ముప్పన రఘు, డాక్టర్ బి.రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఐఎంఎ హాల్ వద్ద రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరోగ్య హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ నల్లరిబ్బన్ ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర థియేటర్ సెంటర్ వరకూ డాక్టర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ పిఎన్‌డి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య హక్కు చట్టం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం ప్రయివేట్ వైద్యశాలలకు ఇవ్వాల్సిన అనుమతుల మంజూరులో కాని, భవన నిర్మాణ, అగ్నిమాపక అనుమతుల విషయంలో కాని ఎలాంటి రాయితీలు ఇవ్వకుండా, జిఎస్‌టి, ఆదాయపు పన్ను ముక్కుపిండి వసూలు చేస్తూ ఉచితంగా సేవలు అందించాలని ఆదేశించడం ఏంటని ప్రశ్నించారు. ఆరోగ్య హక్కు చట్టాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీనియర్ వైద్యులు తాతిన రామబ్రహ్మం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ సభ్యులు వంకా రామదాసు, జిఎస్‌వి ప్రసాద్, రమేష్‌చంద్రబాబు, వేలిచేటి సుందర్రావ పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనుల సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 2021-22లోఉపాధి హామీ, అనుబంధ శాఖల ద్వారా చేపట్టిన పనులపై ఈనెల 28న మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభ ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ ఎస్.మురళీ గంగాధరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం పర్యటించారు. ఈనెల 14 నుంచి 25 వరకు గ్రామాల వారీగా సామాజిక తనిఖీ చేసి మంగళవారం పాలకోడేరులో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సత్యసాయి సేవకులకు సత్కారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక ఏరియా ఆసుపత్రిలో శ్రీసత్యసాయి ఉచిత నిత్యాన్న సేవా పథకం 5వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సూర్యనారాయణ, సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు కె.రవీంద్రప్రసాద్, వ్యాపార వేత్త కొట్టు సత్తిబాబు విచ్చేశారు. సంస్థ నిర్వహిస్తున్న సేవల గురించి అధ్యక్షులు ప్రవా శ్రీనివాస్, కార్యదర్శి ఆకుల సవీన్ బాబా, సమితి కన్వీనర్ జనార్ధన్ రావు, జిల్లా ఆధ్యాత్మిక విభాగ కో ఆర్డినేటర్ జంధ్యాల నాగేశ్వరరావు, జిల్లా మహిళ విభాగ కో ఆర్డినెటర్ శ్రీమతి తోట రాధికా రాణి మాట్లాడారు. అనంతరం సెంటర్ ప్రధాన సేవకులు ఆకుల వెంకటేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణను సత్కరించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గాదాస్, చిట్యాల సురేంద్ర కుమార్, నాయక్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

కాంగ్రెస్ ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు కోరారు. సోమవారం రాత్రి కాళ్లకూరులో నల్లరిబ్బన్లు, కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ న్యాయంగా పోరాడుతోందన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు అందరూ కలిసి రాహుల్ గాంధీపై అనర్హత వేటును ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: ఇటీవల రాహుల్ గాంధీకి రెండేళ్లు జైలు శిక్ష, పార్లమెంట్ సభ్యత్వం నుండి బహిష్కరణను ఖండిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, దళిత సంఘం నాయకులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి ప్రసంగిస్తూ రాహుల్ గాంధీకి శిక్షలు వేయడంలో బిజెపి పాత్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి శిక్ష రద్దు చేసే వరకూ అన్ని పక్షాలతో కలిసి ఐక్య పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గంటా సుందరకుమార్, పాలపర్తి జోనా, దండు శ్రీనివాసరాజు, కనుమూరి వెంకటపతిరాజు పాల్గొన్నారు.

మోగల్లులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరంలోని సాగి రామకృష్ణంరాజు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మోగల్లులో ఉచిత దంత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు, గ్రామస్తులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. విష్ణు డెంటల్ కాలేజ్ వారిచే ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు.